క్లుప్తంగా

అలరించిన ఖవ్వాలీ

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు బస్టాండు వద్దనున్న హజరత్ సైదానిమా ఉరుసు (బడేమ కాన్) ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఖవ్వాలి నిర్వహించారు. ముంబాయికి చెందిన మెయిన్ నాజాం, అన్వర్‌జానీ ఆలపించిన పాటలు అందరినీ అలరించాయి. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు గలఫ్‌లు సమర్పించారు. హిందూ,ముస్లిం సోదరులు దర్గాలో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా మకాన్‌దార్ సయ్యద్‌హాషిం, ఖమర్‌అమీని, మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై అవగాహన

వాల్మీకిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల10వ తేదీ నుండి కుల గణన సర్వే నిమిత్తం తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో శతరుద్ర పారాయణం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయంలో మంగళవారం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో 11 మంది రుత్వికులచే శతరుద్ర పారాయణం నిర్వహించారు. అంతేగాక ఉభయదారులచే శివుని విగ్రహానికి అభిషేకం చేయించారు. తంబళ్ళపల్లి మాజీ ఎమ్మెల్యే ఏవీ.లక్ష్మీదేవమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి : మండలంలోని చీకటిపల్లి సర్పంచ్, సీకాం విద్యాసంస్థల చైర్మన్ డా. టి.సురేంద్రనాథ రెడ్డి తండ్రి సహదేవ రెడ్డి(92) సోమవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం చీకటిపల్లి గ్రామం రంగనాథపురంకు చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు

మదనపల్లె డివిజన్‌లో వర్షం

మదనపల్లె సిటీ : మదనపల్లె డివిజన్‌లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. మదనపల్లె 12.4 మీ.మీ, నిమ్మనపల్లె 26.8, కురబలకోట 26, బి.కొత్తకోట 2.4, పిటీఎం 6.2, తంబళపల్లె 37.4, ములకలచెరువు 5.4, పెద్దమండ్యం 74,వాల్మీకిపురం 35.2, కలికిరి 83.4, రామసముద్రం 3.2 మీ.మీ వర్షపాతం నమోదైంది.

సమాజ సేవపై దృష్టి సారించాలి

మదనపల్లె సిటీ : స్వచ్ఛంద సంస్థలు సమాజ సేవపై దృష్టి సారించాలని వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత సమాజ సేవలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ సుభద్ర, ఫోర్డు లలితమ్మ, ఈశ్వరయ్య, వి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌ఓగా డీఎస్పీ ప్రశాంత్



బి.కొత్తకోట : ఇటీవల అప్‌గ్రేడ్ అయిన బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా డీఎస్పీ ప్రశాంత్ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. డీఎస్పీగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆయనను ఇక్కడ నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రామమోహన్‌ను చిత్తూరు జిల్లా గుడిపాలకు బదిలీ చేయగా సీఐ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌ఓగా నియమించాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులు డీఎస్పీ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌ఓగా నియమించడం విశేషం.

సారా విక్రేతల అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం నిమ్మనపల్లె పంచాయతీ గంగాపురంపల్లె వద్ద స్థానికుడైన చిన్నరెడ్డెప్ప(55) సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే సోమవారం రాత్రి అగ్రహారం పంచాయతీ ఆరిపిరెడ్డిగారిపల్లె వద్ద సారా విక్రయిస్తున్న స్థానిక మహిళ సుహాసిని (30)ను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు



పీలేరు : పట్టణంలో అయ్యప్పస్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అయ్యప్పమాల దారణ ధరించిన భక్తులు మంగళవారం స్థానిక వినాయకస్వామి గుడినుంచి ప్రత్యేకంగా ట్రాక్టర్‌లో అయ్యప్పస్వామి, వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామి విగ్రహాలను అలంకరించి ఊరేగింపు చేపట్టారు. మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలతో నడుమ భక్తిపాటలు ఆలపిస్తూ పట్టణంలో ఊరేగించారు.

జగన్ పాలనలోనే సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



కొత్తపల్లె-1 సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : రాష్ట్రచరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లె-1 గ్రామసచివాలయం, మున్సిపాలిటీలోని 19వవార్డు అప్పారావుతోట, ఇందిరానగర్ వార్డు సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆయా సచివాలయాల పరిధిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు వివిధ పథకాల రూపంలో అందిన లబ్ధిని తెలిపే సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హామీలు 99 శాతం పూర్తిచేసిన ముఖ్యమంత్రి జగన్‌కు, అధికారంలో ఉండగా చెప్పుకునేందుకు ఒక పథకం కూడా అమలు చేయని చంద్రబాబుకు ఎంతో తేడా ఉందని వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో పాటుగా నూతన ఒరవడిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేయడమే కాకుండా అవినీతిరహిత, పారదర్శక పాలన అందిస్తోందన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న మంచి పేరు, ఆదరాభిమానాలు చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. అధికారంలో ఉండగా ప్రజలను మోసగించిన చంద్రబాబు ఇప్పుడు మరోమారు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి జరగాలన్నా, సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలన్నా..మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని పార్టీలు పొత్తు పెట్టుకున్నా ? ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గెలుస్తారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని, పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలందరూ తమ చల్లనిదీవెనలు, ఆశీస్సులు జగనన్నకు అందించి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తేవాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, బావాజీ, సర్పంచ్ శరత్‌రెడ్డి, ఎంపీటీసీ బుస్రి, అక్బర్, హబీబ్, నాగార్జున, మహేష్, ఆంజనేయులు, ఎంపీడీఓ భానుప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, బి.ఏ.ఖాజా, వసీం, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

మదనపల్లె : ప్రజలకు పరిపూర్ణ సేవలు అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని కొండామారిపల్లె పంచాయతీ బెస్తపల్లెలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు సర్పంచ్ ఫాతిమాబీ, ఇస్మాయిల్, ఎంపీటీసీ నీరుగట్టిమేరీ, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్స్‌ను అందించి, ప్రభుత్వ పథకాలపై వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు చెందిన పేద ప్రజలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పథకాలు సక్రమంగా అందాయా? లేదా? అని తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే కార్యక్రమంలో ప్రజలు తెలిపితే తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ పోతబోలు నాగరాజ, నీరుగట్టిరమణ తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల పాత్రే కీలకం

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె : ఎన్నికల విధుల్లో సెక్టోరియల్ అధికారులే కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని ఆర్డీఓ ఎం.ఎస్. మురళి అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో 164- మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సెక్టోరియల్ అధికారులకు ఈవీఎం, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... మదనపల్లె నియోజకవర్గంలో మొత్తం 259 పోలింగ్ కేంద్రాలకు 43 మంది సెక్టోరియల్ అధికారులకు విధులు కేటాయించామన్నారు. వీరు ఈవీఎంలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఈవీఎం, ఇతరాలకు సంబంధించి ఏవైనా చిన్నచిన్న సమస్యలు వస్తే పరిష్కరించే అవగాహన, నేర్పు, నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా ఒకో సెక్టోరియల్ అధికారికి 5-7 పోలింగ్ కేంద్రాలు కేటాయించామన్నారు. ప్రతి సెక్టోరియల్ అధికారి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా ర్యాంపులు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఇతర వసతులు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు, కంట్రోల్‌యూనిట్ పనితీరును సెక్టోరియల్ అధికారుల సమక్షంలో డెమో నిర్వహించి పరిశీలించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆర్డీఓ.. ఓటరు జాబితా తయారీలో ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే తన దృష్టికి నిర్భయంగా తీసుకురావాలన్నారు. ఒకే పోలింగ్ కేంద్రంలో ఒకే ఇంటికి సంబంధించిన ఓట్లు వేర్వేరుగా ఉంటే ఇబ్బంది లేదని, అలాకాకుండా మరో పోలింగ్ కేంద్రంలో ఉంటే ఫారం-8 సమర్పించి, బదిలీ చేసుకోవాలన్నారు. ఫారం-7కు సంబంధించి అన్ని ఆధారాలు సమర్పించాకే ఓటును తొలగించడం జరుగుతుందని, ఒక వ్యక్తి 5కంటే ఎక్కువ క్లెయిమ్‌లు ఇచ్చేందుకు వీలు లేదన్నారు. ఫారం-6 కొత్తగా ఓటరు నమోదుకు సంబంధించి నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తరపున మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, టీడీపీ ఆర్.జీ.వెంకటేష్, దేవరింటిశ్రీనివాసులు, మేకలరెడ్డిశేఖర్, జనసేన జంగాలశివరాం, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్‌లు దైవరాజన్, సీ.ఆర్.మంజుల, మహబూబ్‌చాంద్, ఎలక్షన్ డీటీ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



తంబళ్లపల్లె : వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

తంబళ్లపల్లె : నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేసిన అభివృద్ధి, ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి మరో మారు వైఎస్సార్‌సీపీని ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి కోరారు. మంగళవారం గుండ్లపల్లె గ్రామ సచివాలయంలో వై నీడ్స్ జగన్ కార్యాక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ సంక్షేమం, అభివృద్ధి వివరాలతో డిజిటల్ బోర్డులు, బుక్‌లెట్‌లు ఆవిష్కరించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కుల,మతాలకు ,రాజకీయ పార్టీలకు అతీతంగా ఇంటింటికి చేరిన పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సురేంద్రరెడ్డి, సర్పంచు మౌలాలీ, నాయకులు మహేష్‌రెడ్డి,భాస్కర్‌రెడ్డి, గంట్ల సురేంద్ర, రవినాయక్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే అభివృద్ధి

పెద్దతిప్పసముద్రం : జగనన్న పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎంపీపీ మహమూద్, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. మండలంలోని రాపూరివాండ్లపల్లిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పప్పు రాజారెడ్డి, రామక్రిష్ణల ఆధ్వర్యంలో నిర్వహించారు. జగనన్న సంక్షేమ పాలనా విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిరిధర్‌రెడ్డితో పాటు సాదిక్, ఫుజేల్, రవికుమార్, జయన్న, గౌతంరెడ్డి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

కలకడ : జగనన్నతోనే పేద ప్రజల అభివృద్ధి సాధ్యం. ప్రతి పేద కుటుంబం ఆర్థిక అభివృద్ధి సాధించి పేదరిక నిర్మూలన కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ శ్రీదేవి, మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ సచివాలయం వద్ద సచివాలయం పరిధిలోని సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించి ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా గుర్తించి అవసారానికి నిధులు విడుదల చేసి ప్రతికుటుంబాన్ని ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు జివి కిషోర్, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, వెంకట్రమణ, చలమయ్యగౌడ్, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



బి.కొత్తకోట: ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న శివారెడ్డి



పెద్దతిప్పసముద్రం : కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : జిల్లా సహకార బ్యాంకు బి.కొత్తకోట వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సొసైటీ బ్యాంకులో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత వారు బ్యాంకు పథకాలు, సామాజిక భద్రత,ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనా పథకం, జీవన్ జ్యోతి బీమా యోజనా, జీరో బ్యాంకు ఖాతా, అభయ రుణాలపై కళాజాత ద్వారా బ్యాంకు పరిధిలోని ఖాతాదారులు, రైతులకు అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ శివారెడ్డి, సూపర్‌వైజర్ సీ.చంద్రశేఖర్, పీటీఎం బ్యాంకు సీఈఓ చంద్రశేఖర్ కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు అవగాహన

బి.కొత్తకోట : సహకార బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం స్థానిక డీసీసీబీ బ్రాంచ్‌లో ఎంపీ రూరల్ ఆర్ట్ ఫోక్ ఆర్గనైజెషన్ సంస్థ కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఎస్.శివారెడ్డి మాట్లాడుతూ బ్యాంకు పథకాలపై సామాజిక భద్రత పథకాలైన పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన, జీరో ఖాతాలు, ఘర్ ఘర్ కేసీసీ, నగదు రహిత లావాదేవిల గురించి వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈఓ ఆదినారాయణ, సూపర్‌వైజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఏడుగురికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.11,00,000 లక్షల చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించారన్నారు. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు చింతల శివానంద రెడ్డి, శ్రీధర్‌రాయల్, మహబూబ్‌బాషా, రాయుడు, ఆనంద, కువైట్ శంకరాచారి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు చెరువులకు మళ్లింపు



వర్షపునీటిని పరిశీలిస్తున్న నాయకులు

పీలేరు : తుపాను ప్రభావంతో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మండలం సరిహద్దులోని బాలంవారిపల్లె ప్రాజెక్టు నిండిపోయి మొరవ పారుతోంది. వర్షపునీరు వృథా కాకుండా చెరువులకు మళ్లించడానికి జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీపీ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రదొడ్డిగారిపల్లె చెరువు, తుమ్మలవారిపల్లె చెరువు, అయ్యపునాయునిచెరువులకు నీరు మళ్లించడానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్, రమేష్ రెడ్డి, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశులు

గుర్రంకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్, ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10 తేది నుంచి కులగణన యాప్ ఆన్‌లైన్‌లో ఓపెన్ అవుతుందన్నారు. యాప్‌లో మొత్తం 12 అంశాలు ఉంటాయన్నారు. ప్రతి వలంటీర్ ప్రతి కుటుంబానికి వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు యాప్‌లో ఉన్న 12 అంశాలను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి 200 కుటుంబాలకు ఒక పర్యవేక్షణాధికారి ఉంటారన్నారు. వీరు వలంటీర్ల పనితీరును పర్యవేక్షిస్తుంటారన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, అధికారులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా కిట్లు అందజేత



క్రీడా కిట్లు అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనే యువతకు ఉచితంగా ప్రభుత్వం క్రీడా కిట్లు పంపిణీ చేసిందని, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల వారి ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడాసామగ్రిని పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధారుఢ్యం కలిగి ఆరోగ్యంగా ఉంటారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏపీఎం రమేష్, బాలయ్యగారిపల్లె ఆర్‌బీకే ఇన్‌చార్జ్ ఆర్‌వి, ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఊలపాడులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



మాట్లాడుతున్న ఎంపీడీఓ నారాయణస్వామి

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ నారాయణస్వామి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలలో అవగాహన కల్పించారు. బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, నాగభూషణం శెట్టి, బిజెపి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కళ్యాణ యోజన, గ్రామ నివాస్ ద్వారా ఇంటిఇంటికి కొళాయి కనెక్షన్ ఉచితగ్యాస్ కనెక్షన్ , పిఎం క్రెడిట్ కార్డు, పోస్ట్ ఆఫీస్ ద్వారా బెనిఫిట్ సౌకర్యం , పశుపోషణ , క్రెడిట్ కార్డులు అందజేయడం జరిగిందన్నారు. రైతులకు డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయడానికి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ లీలా, రెడ్డివీరేగౌడు, చలపతి, ఆనంద, హెచ్‌పిగ్యాస్ మధుసూదన్, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు మోక్షం

రాయచోటి : జిల్లా కేంద్రానికి మణిహారంలా ఉన్న రింగ్ రోడ్డు పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కావడంపై ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పెండింగ్ పనుల పూర్తిపై ఆయన స్పందించారు. రింగ్ రోడ్డు నిర్మాణంలో కొన్ని కారణాల రీత్యా పెండింగ్‌లో ఉన్న మదనపల్లి మార్గంలోని రింగ్ రోడ్డు, చెన్నముక్కపల్లె వద్ద పెండింగ్ పనులు, ఎస్‌ఆర్ కళ్యాణ మండపం సమీపాన ఉన్న రింగ్ రోడ్డు పనులకు సంబంధించి భూసేకరణకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. వీటి నిర్మాణాలను పూర్తిచేసేందుకు రూ. 4.5 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. న్యాయస్థానంలో వ్యాజ్యాన్ని వేసిన వారిచేత ఉపసంహరింపజేసి, వారికి అందజేయాల్సిన పరిహారాన్ని ఇవ్వడంతో పాటు మిగిలిన రూ. 1.5 కోట్ల నిధులతో పెండింగ్ రోడ్డు నిర్మాణ పనులను చేపడతామన్నారు.

63 హెక్టార్లలో వరి పంట నష్టం



దెబ్బతిన్న వరిపంటను చూపుతున్న రైతు

మదనపల్లె : మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని 63 హెక్టార్లలో దాదాపు 200మంది రైతులకు చెందిన వరిపంటకు నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు ఏఓ నాగప్రసాద్ తెలిపారు. వరి పంట కోతదశకు వచ్చిన సమయంలో తుఫాను ప్రభావంతో పంట నేలకొరిగి నష్టం వాటిల్లిందన్నారు. దీంతో ఆర్‌బీకే సిబ్బందిని గ్రామాల్లో జరిగిన పంటనష్టం వివరాలను సేకరించాల్సిందిగా ఆదేశించామన్నారు. మంగళవారం తుఫాను తీరం దాటనుండటంతో.. బుధవారం పూర్తిస్థాయిలో నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులు అందిస్తామన్నారు.

అపార వర్షంతో నష్టం



నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతు

వాల్మీకిపురం : ఇటీవల కురుస్తున్న గాలీ వాన బీభత్సానికి మండలంలో పలు చోట్ల రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది. మండలంలోని చింతలవారిపల్లిలో వరిసాగు రైతులకు తీవ్ర నష్టం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతలవారిపల్లికు చెందిన ప్రతాప్ రెడ్డికి 2.5 ఎకరాల వరి పంట, వెంకటప్పకు ఒక ఎకరా వరి పంట నష్టం కలిగిందని వాపోయారు. అలాగే మండలంలోని వివిధ రకాల పంటల రైతులకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

7న ఆర్టీసీ ఎండీ మదనపల్లెకు రాక

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో పరిధిలోని భారత్ పెట్రోలియం బంకును ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు గురువారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం డిపోలో గ్యారేజీ, డిపోలను తనిఖీ చేసి డీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ : హజ్‌యాత్ర-2024కు దరఖాస్తులను ఆహ్వానిస్తూ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రభుత్వ సర్‌ఖాజీ హాఫీజ్ సయ్యద్ ఇక్బాల్‌సాహెబ్ తెలిపారు. వచ్చే ఏడాది మక్కాలో హజ్, మదీనా యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి ఉన్న ముస్లింలు డిసెంబర్ 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్టు జిరాక్సు కాపీ, ఆధార్, బ్లడ్ గ్రూపు సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు-2, బ్యాంక్ అకౌంట్, కోవిడ్-19 సర్టిఫికెట్ కాపీలు జతచేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7013669760ను సంప్రదించాలన్నారు.

చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి కృషి

కలికిరి : పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెండింగ్‌లోని చెక్‌బౌన్స్ కేసుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వాల్మీకిపురం సీఐ సురేష్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని వాల్మీకిపురంలో 28 కేసులకు గాను 15 పెండింగ్‌లోనూ, కలికిరిలో 11కు గానూ మొత్తం పెండింగ్‌లోనే ఉన్నట్లు పేర్కొన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిందితుల గుర్తింపునకు టీం ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నామన్నారు.

అవగాహనతో ఓటు వేయడం సులభం

తంబళ్లపల్లె: రానున్న ఎన్నికల్లో ఈవీఎం మిషన్లపై ఓటర్లకు అవగాహన ఉంటే ఓటు వేయడం సులభమని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం గుండ్లపల్లె, అన్నగారిపల్లె,గంగిరెడ్డిపల్లెలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఈవీఎం మిషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టోరియల్ ఆఫీసర్ త్యాగరాజు ఈవీఎం మిషన్ల నిర్వహణ, ఓటరు ఓటు వేసే తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు మౌలాలి, ఓటర్లు పాల్గొన్నారు.

పక్కాగా కులగణన పూర్తి చేయాలి

కలకడ : మండలంలో పక్కాగా కులగణన పూర్తి చేయాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కులగణన అధికారులు, సిబ్బంది, పార్టీ నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. అవకాశం ఉన్నంతవరకూ పాఠశాల ధ్రువపత్రాలు ఆధారంగా కులం పేరు నమోదు చేయాలని సూచించారు. లేని పక్షంలో గ్రామస్తుల సమాచారం , వలంటీర్, వీఆర్ఓ, వీఆర్ఏల సమక్షంలో నమోదు చేసి సమస్యలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ విశ్వనాథ, ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శాంతభాయ్, యశోధరాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెయ్యేరులోకి వరదనీరు

రాజంపేట : చెయ్యేరులోకి 5,600 క్యూసెక్కులు వరదనీరు ప్రవాహించే అవకాశాలు రాత్రికి ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వరదనీటి ప్రవాహం పెరుగుతోందన్నారు. వరద పరిస్థితిని అంచనా వేయలేమని, అందువల్ల చెయ్యేరు పరివాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెపుతున్నారు.